# చైతన్యం

సృష్టిలో రాళ్లూరప్పల్ని వదిలేస్తే, చైతన్యానికి ప్రకృతే ప్రతీక! కాలం, దానితో పాటు పంచభూతాలు ఎప్పుడూ స్తబ్ధంగా ఉండవు. అవి నిత్య చైతన్యానికి నిదర్శనాలు. స్తంభించాయంటే, లోకమే శూన్యమవుతుంది.

గాలి వీస్తూ ప్రాణవాయువు ఇస్తుంది. నీరు ప్రవహిస్తూ దప్పిక తీరుస్తుంది. కల్మషాన్ని తొలగిస్తుంది. అగ్ని జ్వలిస్తూ సమస్త వ్యర్థాల్నీ భస్మీపటలం చేస్తుంది. ఆకాశం- సూర్యచంద్రులకు, నక్షత్రాలకు, మబ్బులకు వేదికగా నిలుస్తుంది. కాల గణనకూ ఆధారమవుతుంది. భూమి తన చుట్టూ తాను, అలాగే సూర్యుడి చుట్టూ తిరుగుతూ ప్రాణులకు కాల గమనాన్ని ఎరుకపరుస్తుంది. రుతువులకు అస్తిత్వమిస్తుంది. పక్షులు ఎగరడానికి, జంతువులు ఉరకలెత్తడానికి, కీటకాల కదలికకు, చెట్ల పరపరాగ సంపర్కానికి, జీవుల ఫలదీకరణకు, సృష్టిచక్రం నిరాఘాటంగా తిరగడానికి- అంతటికీ చైతన్యమే మూల కారణం.

కణ నిర్మితమైన మానవ శరీరం చైతన్యవంతమైంది. కోట్ల కణాల వల్ల అది ఎదుగుతుంది. జడ పదార్థంగా కనిపించే విత్తనాన్ని మట్టిలో నాటి, నీటిచుక్కలు చిలకరించగానే జీవం పోసుకుంటుంది. మొలకెత్తి మొక్కగా, చెట్టుగా మారుతుంది. మొగ్గ, పువ్వు, కాయ, పండు- ఒకదాని తరవాత మరొకటిగా దశలన్నీ మారుతుంటాయి. వాటిని క్షుణ్నంగా పరికించగలిగితే, చైతన్య స్వరూపానికి అర్థం అవగతమవుతుంది.

ఒకరోజు ఒక వ్యక్తి బుద్ధుడి వద్దకు వెళ్లి, అనరాని మాటలన్నాడు. నిందించాడు. ఆయన శాంతంగా ఉన్నాడు. చిరునవ్వుతో విన్నాడు. తరవాత ఆ వ్యక్తి వెళ్లిపోయాడు. మరుసటి రోజు వచ్చి, పశ్చాత్తాపంతో బుద్ధుడి పాదాలపై పడి, క్షమాపణ కోరాడు. నిన్న దూషించినందుకు మన్నించాలని అర్థించాడు. బుద్ధుడు 'ఒక వ్యక్తిని నిందించి, మరో వ్యక్తిని క్షమాపణ కోరుతున్నావు' అన్నాడు. అతడు నిర్ఘాంతపోయి, 'నిన్న వచ్చి మిమ్మల్ని నిందించాను కదా' అని గుర్తుచేశాడు. 'నిద్రపోయి లేచాను. ఇప్పుడు నేను మరో మనిషిని. నది ప్రవహిస్తూ ఉంటుంది. అయినా, నిన్న అడుగుపెట్టిన నది నీటిలో నేడు అడుగుపెట్టలేవు. జీవితమూ నది నీరు వంటిదే' అని బుద్ధుడు బదులిచ్చాడు. చైతన్య పూరితమైన ఆయన మనసుకు ప్రతి క్షణమూ కొత్తదే.



అంతర్యామి

ఈ చరాచర జగత్తు సమస్తం ఒక లీలావినోదం. ఇది విశ్వ చైతన్య ప్రదర్శన. నాట్యం నుంచి నాట్యకారుణ్ని విడదీయలేం. సృష్టిని, సృష్టికర్తను వేరు చేయలేం. ఈ సత్యమే నటరాజ స్వరూపంలో కనిపిస్తుంది. ఈ రూపంలోనే పంచభూతాలూ గోచరిస్తాయి. శివం అంటే చైతన్యం. నటరాజు ఒక చైతన్య స్వరూపం. ఆయన ఆనంద నాట్యానికి వేదిక ఈ విశ్వం!

ప్రాణులకు మెలకువ, కల, నిద్ర అనే మూడు అవస్థలు ఉంటాయి. నాలుగోది చైతన్య స్థితి. అంటే- మెలకువ, కల, నిద్ర కాని స్థితి! ఆ స్థితి ధ్యానంలోనే అనుభవానికి వస్తుంది. అదే స్థితిలో లభ్యమయ్యే క్షణకాల దర్శనమే శివ తత్వం! చేతనత్వంతో నిండిన ఆ రూపం విశ్వవ్యాప్తంగా ఉంటుంది. జీవం గల ప్రతిదానిలోనూ ఆ తత్వం నిబిడీకృతమై ఉంది. దాన్ని దర్శించి అనుభూతి చెందాలి.

బాల్యం, యౌవనం, కౌమారం, వార్ధక్యం- ఇవి మనిషి జీవితంలోని శారీరకమైన ముఖ్య దశలు. మనసు మాత్రం కాలానికి లొంగని నిత్య చైతన్య స్రవంతి. దాన్ని వయసుతో ముడిపెట్టకూడదు. 'నా దేహానికి ముసలితనం వచ్చినా, నా చైతన్యానికి ముదిమి రాలేదు' అనేవారు 'లోకమాన్య' బాలగంగాధర తిలక్.

మన ఆలోచనలే ప్రగతికి కారణాలు. ప్రతిబంధకాలూ అవే! సవ్యమైన ఆలోచనలు సత్ఫలితాలనిస్తాయి. అనవసరమైన ఆలోచనల నుంచి మనసును లక్ష్యం వైపు మళ్లించాలి. నీరు ప్రవహించకుంటే, అది కల్మష కాసారమవుతుంది. గాలి స్తంభిస్తే, ఉక్కిరిబిక్కిరవుతాం. ఒక్కోసారి అనుకోని పరిణామాలు ఎదురయ్యాయని మొత్తం ఆలోచనలన్నింటినీ వాటిపైనే కేంద్రీకృతం చేయకూడదు. ఘనీభవించిన ఆలోచనల వల్ల పురోగతి ఉండదు.

మనిషి ఎప్పటికప్పుడు ఆశావహ దృక్పథంతో సాగాలి. నవీనత్వపు ఆలోచనల ప్రవాహానికి అవరోధం కల్పించకూడదు. సాఫీగా కొనసాగనివ్వాలి. అప్పుడే, చైతన్యవంతంగా జీవించడంలోని మధురానుభూతి మానవుడి సొంతమవుతుంది!

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు